

# దమయంతి ఆత్మకథ

(చిత్రగుప్త ప్రతినిధి)

స్వర్గములో కూడా యెన్నో నిర్బంధములు, వైషవ్యములు వుంటవని తెలిసికొనడానికి మరొక అవకాశం కలిగినది.

పతివ్రతలందరూ సమావేశమై భూలోకంలోని వారివారి జీవిత విశేషములను చర్చించి వారివారి సంబంధమువున్న వ్యక్తులను అపహాస్యము విమర్శచేయడానికి ప్రయత్నిస్తూ వున్నారు కనుక యిటువంటి సమావేశములకు అవకాశము యివ్వరాదంటూ స్వర్గములోని వారు దేవేంద్రుని వద్దకు రాయబారము పోయారనీ, అందువల్ల దేవేంద్రుడు విషయ విచారణకోసమని ఒక పక్షము దినములవరకు సమావేశములు నిలుపి వేయించెనని తెలిసినది. వివరములకోసము మా ప్రతినిధి కొంచము శ్రద్ధవహించాడు.

ఒకనాడు దేవేంద్రుడు ఒకరిద్దరు పతివ్రతలను తన సమక్షానికి పిలిపించి నారదుని యెదుట వారిని విచారించి, పతివ్రతలు చెప్పినదంతా విని—యిలా స్త్రీలు సమావేశమై పూర్వగాథలు చెప్పుకోవడములో తప్పులేదని తీర్పు చెప్పాడు.

ఇది జరిగిన అనంతరం పతివ్రతలు విజయకోలాహలముతో సమావేశమయారు. ఆ సమావేశమునకు ద్రౌపది అధ్యక్షత వహించింది దమయంతి భూలోక జీవితములోని కొన్ని విశేషములను చెప్పవలెనంటూ దమయంతి చెప్పినది.

కరతాళ ధ్వనులమధ్య దమయంతి వేదికవద్దకు వచ్చి నిలచినది. ఆమె యిలా ఉపన్యసించినది:

సోదరీమణులారా, నన్ను యీదినమున మీరు ఉపన్యసించ మన్నారు. ఇది సంతోషమే. అయినప్పటికీ మొట్టమొదటి దినమే నేను ఉపన్యసించ వలసినందుకు మాత్రం కొంచం భయంగావుంది. ఏ విషయము చెప్పడమో, యేవిషయము వదలివేయడమో నాకు యిప్పుడు తెలియడములేదు. నా జీవితములోని ప్రతి ఘట్టమూ నాకు ముఖ్యమైనదిగానే కనబడుతూ వుంటుంది. అదే విధముగా మీమీ జీవితములలోని ప్రతి ఘట్టమూ మీకు ముఖ్యముగానే కనబడుతూ వుంటుంది. కాని వినేవారికి- చెప్పేవారి జీవితములోని అనేక అంశములు యెంతమాత్రమూ వినడానికి యింపుగా వుండవు. ప్రస్తుతం అధ్యక్షత వహించిన ద్రౌపది మనకు క్రిందటి సమావేశములో యేయే విషయముల గురించి యెలా యెలా వుపన్యసించాలో టూకీగా చెప్పింది. అదే దృష్టిలో వుంచుకొని నేను యిప్పుడు ముచ్చటిస్తాను.

మా నాన్నగారు నాకు విద్యాబుద్ధులు నేర్పించారు. సంగీతం కూడా నేర్పించారు; కాని నాకు సంగీతం నేర్చుకోవడముకన్నా వినడమే యెక్కువ యిష్టంగా వుండేది, అందుకోసమని నాకు ఆ విద్య వొంటబట్టలేదు. స్వతహాగా నేను కొంచం మంద ప్రవృత్తి కలదానిని. అందువల్ల యేసంగతిలోనూ ఉత్సాహం చూపే దాన్నికాను.

యుక్తవయసు వచ్చాక మా తండ్రిగారు నా వివాహ ప్రయత్నం ప్రారంభించారు. మనకు స్వయంవరమే కదా అసలు జరుగవలసినది! ఐనా మా నాన్నగారు ముందు అన్ని యేర్పాటులూ చేయించారు. ఏ రాష్ట్రపు రాజకుమారుడికి పెళ్ళికాలేదు, యేరాజకుమారుడు అందగాడు, ఎవనికి మంచి శక్తి సామర్థ్యములు వున్నవి—యిటువంటి వివరములన్నీ—పురోహితులను పంపి ముందుగా తెలుసుకున్నారు. ఆయా రాజుల చిత్రపటాలు తెప్పించారు.

మా నాన్నగారు తెప్పించిన రాజుల చిత్రాలు నేను చూచాను. ఆనాటి వేషాలు, పద్ధతులు యీనాడు తలుచుకుంటే నవ్వు వస్తూ వుంది. కొందరు బుర్రమీసాలవారు, కొందరు కోరపాగాలవారు, మరికొందరు పూసల హారాలవారు-యీవిధంగా అనేకమంది అనేక తరహాలుగా తయారయారు. కొన్ని చూస్తే నవ్వువచ్చేది. కొన్ని చూసే వీళ్ళేమా యిలా వున్నారు, యిలా సింగారించుకున్నారు, వీళ్లకు యే మాత్రమూ కళాదృష్టిలేదేమాఅని జాలివేసేది.

ఆ వచ్చిన చిత్రములలో నలమహారాజుది ఒకటి. నలమహారాజు పొడుగుగా, చక్కగా కనుపించాడు. కన్నుతీరు ముక్కుతీరు చక్కగావున్నవి (యీ సందర్భములో దమయంతి కొంచము సిగ్గు అభినయించింది అధ్యక్షత వహించిన ద్రౌపది, దమయంతివైపు వంగి సిగ్గుపడితే చెప్పేదానిలో యెన్నో అసత్యాలు దొర్లుతవనీ, సిగ్గుపడ నవసరంలేదని చెప్పినది. తరువాత దమయంతి ఉపన్యాసం సాగించినది)

నేను ఆయన్ని మోహించాను. ఆయననే యెలాగైనా వివాహంచేసికోవాలనుకొన్నాను. కాని మహారాజు సాధారణమైన రాజుయింట జరిగే స్వయంవరానికివస్తే రావచ్చు, రాకపోతే రాకపోవచ్చు. ఆ భయంతో నేను ముందుగానే యేదైనా యేర్పాటు చేయడము మంచిదనుకున్నాను. అందువల్ల నేను నా చెలికత్తెతో అతిగోప్యంగా యీ సంగతి చెప్పాను.

నేను హంస సందేశాన్ని పంపాననీ, అదిపోయి మాట్లాడినదనీ అనేక ప్రబంధాలలో వ్రాసివున్నవి. కాని యిది కేవలం తప్పు. నేను హంసను పంపనూలేదు, అదివెళ్ళి అప్పటికి నాకు కాబోయే భర్తతో మాట్లాడనూలేదు. మేము వేసిన యెత్తేవేరు: నలుడి తాలూకు పావురములలో వొక పావురం తెప్పించడం

దానితో మన పావురాన్ని యింకొక దానిని జతచేసి పంపడం- యిదీ వేసినయెత్తు మా చెలికత్తె చాలా శ్రమపడి యెలానో వొకలాగు నలుడి పావురాన్ని తీసికొనివచ్చింది. ఆ చెలికత్తెచేతనే "గుణ రూపయవ్వనాలలో నీకు దమయంతిసరిపోతుంది కనుక మీ యిద్దరి సమాగమము అన్యోన్యంగా వుంటుంది" అని వ్రాయించి ఆచీటిని నలుని పావురము కాలికికట్టి దానితో మా పావురాన్నికూడా జతచేసివదలాం.

నలుడిపావురం తిన్నగా నలుడి దగ్గరకు వెళ్ళి వాలింది. ఆ కాలిన వున్న ఉత్తరంచూచి చదివి సరే అని అంగీకారాన్ని-జతలో వచ్చిన మా పావురంకాలికి-కట్టి వదలివేశాడు. మా పావురం మాకుచేరింది. జరిగినది యిది అయితే మానాన్నగారి దగ్గరా, మావారి దగ్గరావుండే కవులు వగయిరాజనాభా- పక్షుల్లో ఉత్తమమైనది హంస గనుక అదే రాయబారం సాగించినట్లు ప్రబంధాలు అల్లేశారు.

ఆ తరువాత స్వయంవరం జరిగింది. స్వయంవరంలో తమాషా అంతా మీరు యెరుగుదురు. అందులో యెంతవరకు నిజమో యెంతవరకు తమాషాయో అది నాకన్నా ఆ స్వయంవరానికి చూడ్డానికి వచ్చినవారికే యెక్కువ తెలిసివుంటుంది. నేను సిగ్గుతో తల యెత్తలేదు. కాని నలమహారాజులు ఐదుమంది ప్రత్యక్షం అయినప్పుడుమాత్రం నేను గాభరాపడి బిత్తరపోయి చూచాను. కాని ఆ దిక్పాలురు నన్ను కనికరించి నేను నలుణ్ని వరించేలా చేశారు.

వివాహం అయింది. ఒకరిని ఒకరం ప్రేమించుకున్నామేమో రోజు ఒక క్షణంగా గడిచిపోతూ వుండేది కాని నలుడుమాత్రం ఆ సమయంలో కూడా కొన్ని కొన్ని సందర్భములలో అన్యాయం చేసేవాడు. నలుడు యెక్కువగా మద్యం సేవిస్తూ వుండేవాడు అసలు మద్యం సేవించడము మన వారందరికీ ఒక మర్యాదయే అయినప్పటికీ యింతచేటు మితిమీరి త్రాగడము నాకు నచ్చేది కాదు. అలా యెక్కువగా త్రాగడము కూడదని యెంతో వారించాను. కాని ఆయన వింటేగా! ఇంతే గాదు-, ఆయనకు జూదం అంటే చాలా యిష్టం. మేము యిద్దరమూ కులాసాగా తిరుగుదామని అనుకొని అందుకు తయారై వెళ్తూ వుంటే, ఆసమయంలో యెవరన్నా సేవకుడు వచ్చి జూదం ఆడడానికి యేదో వూరినుంచి యెవరో వచ్చారని చెవిని వేస్తే సరి- ఆయన 'యిప్పుడే పది ఘడియల్లో వస్తాన'ని చెప్పి నన్ను తోటలో వదలి వెళ్ళిపోయేవారు. పది ఘడియల్లో వస్తానని ఆ పోవడం పోవడం మళ్లీ యే అర్ధరాత్రికో తిరిగి వచ్చేవారు ఆ సమయములలో నాకు మహా కష్టగా వుండేది. కాని పతిభక్తి గురించే లక్షలు సూత్రాలు తయారయి వున్నవి గాని పత్నీ భక్తి గురించి యెటువంటి ఆధారాలూ లేనేలేవు. ఏం చేయడం! ఆయన చేసేపనులు యెంత వెగటుగా తోచినా యెంత అక్రమాలైనా ఉత్సాహంగా యెటువంటి యితరమైన యోచనా లేకుండా శిరసావహించవలసిందే. అందువల్ల నా ఆత్మగౌరవాన్ని ఒక మూల నెట్టివేసి ఆయన సౌఖ్యమే, తృప్తియే నా ఆనందంగా భావిస్తూ అదే ధోరణిలో సుఖంగా జీవిస్తూ వుండేదాన్ని— ఇలా కులాసాగా కొన్ని యేళ్లు గడిచాయి. మాకు యిద్దరు సంతానం.

ఒకనాడు నాకు అదోలా వుంది. చెడుగు యేదో జరిగేటట్టుగా స్ఫురిస్తూవుంటే యింతలో నలమహారాజు అతి ఉత్సాహంగా వచ్చాడు. నా మనసులోని యోచన ఆయన్ని చూడగానే మాయమయింది. ఆయన యెక్కుసా నిలవడము లేదు.

"ఇదుగో! ఇవ్వాళ యెంతపెద్దవిశేషమంటే అంతపెద్ద విశేషం! పుష్కరుడితో ఆడుతూ వున్నా. వాడు పొగరుబోతు; తనంత గొప్ప ఆటగాడు లేడని వాడి ఉద్దేశం. ఆ పొగరు యివ్వాళతో అణగిపోతుంది. యింక వెళ్తా" అంటూ గడగడా రెండు గ్లాసుల మద్యం త్రాగివేశాడాయన.

నేను కాస్తావేళ్ళాపడి యీజూదం వద్దు గాక అంటే వద్దని బ్రతిమాలాను. ఆయన వినలేదు. నాకేమో భయంవేస్తుంది అన్నాను. ఆయన చర్రుమంటూలేచి 'ఏమిటీ నీవు వీరాంగనవు కావూ? అన్నారు. నేవెళ్తున్నా" అనిచెప్పి జూదానికి వెళ్ళిపోయారు.

ఎవరన్నా సరే- నా అంతటివాడు యీ ప్రపంచంలో మరొకడు లేడని యెన్నడూ అనుకోరాదు. అదే మావారిని చెడిచింది. పుష్కరుడు మావారిని

వోడించాడు. మావారు రాజ్యాన్ని పూర్తిగా వోడి పోయారు. చివరకు కట్టు గుడ్డలతో తయారయారు.

ఏమయినా యిద్దరమూ వొకచోట వుంటే అదే స్వర్గం అనుకొనిననేను, ఆయన 'నా దారిని నేనుపోతాను నీవు నీపుట్టింటికి పిల్లలతో వెళ్ళిపో, అనినా విన కుండా పిల్లల్ని మాత్రం పుట్టింటికిపంపి నేను మావారితో సహా అరణ్యాలకు పోయాము.

ఎండలు మండిపోతూవున్నాయి. కొండల మీది బండ శిలలు వొకదానితో యింకొకటి రాపాడి అంటుకొంటున్నాయి. ప్రాణాలకోసం ఒకచోటినుంచి యింకొకచోటికి పరుగులెడుతూవున్నాం. అలానే కాలం గడుపుతూ వచ్చాం.

కాని యెంతకాలమని అలా వుండడం? తిండిలేక ప్రాణం సొమ్మసిల్లి పోతూవుంది. కేవలం జూదములో పడి విలువిద్యవకయిరా అంతా మరచిపోయారేమో-ఒకచిన్న జంతువును చంపడానికికూడా వీలులేక పోయింది.

ఒకనాడు మట్టమధ్యాహ్నం తిండిలేక సొమ్మసిలిపోయాను. 'నేను యెలాగన్నా యింత ఆహారం పట్టుకవస్తా'నంటో ఆయన బయల్దేరారు. యెక్కడో రెండు పావురాలు కనబడ్డాయట వాటిని వలవేసి పట్టుకొన్నట్టుగా పట్టుకుందామని ఉన్నధోవతి ఎగరవేశారట యింతలోకే సుడిగాలివచ్చిందో మరేమే అయిందో ఆధోవతి కాస్తా-పోయింది; ఆకులు అలములు చుట్టుకొని భిల్లనాయకుడిలాతయారయారు. నిజం చెప్పవద్దూ, నాకు గుండె నీరయిపోయినది. నేను సగముచీర కట్టుకొని, వారికి మిగతాసగమూ చుట్టబెట్టాను. అలసిన ప్రాణమేమో, యేడ్చియేడ్చి నిద్రపోయాను.

మెలకువ వచ్చింది. చూసేసరికి సగం చినిగిపోయిన చీరా నేనూ మిగిలా. ఆయన కనబడలేదు. దుఃఖంతో గుండెలు అదిరిపోయినవి. అయినా యేదయినా తేడానికి వెళ్ళి వుంటారని వెతకాను, పేరుపెట్టి పిలచాను. అక్కడ వుంటేగా పలుకడానికి!

నాచీర చించుకొని, నన్ను ఆకారడవిలో అడవి మృగాలకువదలి తనదారి తాను చూచుకున్నారు. తిరిగి కలుసుకున్నాక యిలా యెందుకు చేశారని అడిగితే "నీ దుఃఖం చూడలేక, యిలాచేస్తే నీవు తప్పకుండా పుట్టింటికి వెళ్ళి పోతావని చేశాను"అన్నారు

"అదే మీఉద్దేశంఅయితే, అడవి బయటకు వచ్చాక వదలవలసిందే, అడవిలో వదలితే యెలా వెళ్తాననుకున్నారు" అని అడిగితే ఆయన తికమకలయారు. చెప్పవద్దూ దీనివల్ల నాకు యెంతో కోపం వచ్చింది. అయినా యేం చెయ్యడం?

నేను అడవుల్లో అవస్థలు పడిపడి చివరకు చేయరానివారి అందరి యిళ్లల్లో పనిచేసి యెలాగో వొక్కలాగున మానాన్నగారియిల్లు చేరుకున్నా. చేరానన్న మాటేగాని నాకు జరిగిన యీ మోసానికి వొళ్ళు దహించుక పోతూవుండేది. కనబడితే యేంచేద్దామా అని యెప్పుడూ మండిపోతూ వుండేదాన్ని.

కాని యేది యెలా వుండినా, ఆయన యెంత జూదరియైనా, నాకు యెంత అపకారంచేసినా, ఆయన అంటే నాకు అదేదో మమకారం. ఎప్పుడు చూస్తానా అని తహతహ లాడిపోయేదాన్ని—

నాన్నగారికి నేనంటే పంచప్రాణాలున్ను. అందువల్ల నాకు యెలాగైనా సంతోషం చేకూర్చాలని పట్టుదల. దేశదేశాలు పంపారు మా నాన్నగారు మనుష్యులను. చివరకు మావారి జాడలు తెలిశాయి. ఆయన కురూపి అయారని, ఋతుపర్ణ మహారాజు వంటశాలలో వంటపుట్టిగా వున్నారనీ తెలిసింది. అంతవరకూ ఆయన కోసం తహతహ లాడుతూ వుండిన హృదయం ఒక్కసారుగా అసహ్యపడ మొదలు పెట్టింది. ఇప్పుడు కురూపి; పొట్టపోసి కొనడానికి వంటపుట్టి పనిచేయడమా??—యేమో నాకు మనస్కరించలేదు. ఈయనకు చేయాలంటే యింతకన్నా మంచిపని యేదీ దొరకలేదూ అని అసహ్యించుకున్నాను.

కొన్నాళ్ళు గడిచాయి. నా దైన్యస్థితి మరీ యెక్కువ అయింది. ఎలా వున్నా భర్తయేగదా చూదామని బుద్ధి పుట్టింది. కాని మానాన్నగారు తనతోడి రాజుయింట వంటపుట్టిగా వున్న వాణ్ని యెలా రప్పించడమా -అది అవమానం కదూ!—అని యోచించారు. ద్వితీయ స్వయంవరం ప్రకటించారు. దానికి ఋతుపర్ణ మహారాజు, మారుపేరుతో మారు రూపంతో వున్న మావారిని వెంటబెట్టుకొని వచ్చాడు:

చూచాను. కురూపి మాపిల్లలు వెళ్ళిచూచి అసహ్యపడి తిరిగివచ్చివేశారు. బహిరంగంగా నా భర్త అని వెళ్ళి యిటువంటివాణ్ని స్వీకరించడం యెలాగు? భర్త కుష్ఠరోగి అయినా కురూపి అయినా పూజించవలసిందే అంటూ బోధనలు యెక్కువయాయి. అదే పతివ్రత లక్షణాలు అన్నారు.

పతివ్రత పతివ్రత!

ఎంతటి పెద్దబిరుదు! లోకంలో నా పేరు శాశ్వతంగా వుండిపోతుంది! ఆ ఉత్సాహంతో నేను వెళ్ళి కళ్ళుమూసుకొని రూపు మారివున్న నాభర్త పాదాల మీదపడి, 'యిలా ప్రాణాలతో వచ్చారు. యిదే పదివేలు, మీ పాదపూజ చేయడానికి యిన్నాళ్లూ అవకాశం లేకుండా' చేశారుగా అని బోరునయేడ్చాను.

చెపితే నమ్ముతారో నమ్మరో కాని, అలా యేడ్చితే ఆ కురూపి శిలాహృదయం కరగలేదుగా! పాదములమీద వున్న చేతులు పాదాలతోనే నెట్టి పారవేశారు. నేను నిర్ఘాంతపోయి లేచాను. ఆయన కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. "పట్టమహిషి భార్యవై, యిద్దరి బిడ్డలనుకని, యిప్పుడు ద్వితీయ స్వయంవరం చేసికొంటున్న నీకు నేనెందుకు? నీకు నేను నలుణ్ణికాను, నాకు నీవు దమయంతివికావు" అంటూ చీదరించుకున్నారు.

నా శరీరం దహించుకపోయింది. కోపం తారాచువ్వలా విజృంభించింది మొదటినుంచీ నాకు అన్యాయంచేస్తూ వచ్చి యీనాడుపైగా నన్ను తృణీకరించడానికి సాహసించాడాయన! నేను భరింపలేక ఆ పదిమంది ముందూ దుయ్యబుచ్చుకున్నా. 'ద్వితీయ స్వయంవరమని తప్పపడుతూ వున్నారూ? ఏమి,- మీరు చేసిన తప్పులకన్నా పెద్దతప్పాయిది? జూదం ఆడవద్దు, మితిమీరి తాగవద్దు అని అంటే అర్ధాంగిమాట విన్నారూ? పోసి రాజ్యం పోతేపోయే, యిద్దరం ఒకచోటవుందాం, మీకు నేనుతోడు, నాకు మీరు తోడు అనుకొని మీతోబాటు అరణ్యానికివస్తే- నన్ను కారడవులలో ఆ భయంకరమృగాలికి, కార్చిచ్చులకు, దొంగలకువదలి, మీ ప్రాణం మీకు తీపికాని యెదటివారి సంగతియేమి అన్నట్లుగా వర్తించారేగాని మరొకలాచేశారా? ఇది మీరుచేసిన ద్రోహంకాదూ? నన్ను యిన్ని కష్టాలూ పెట్టి, యీనాడు మిమ్మల్ని రావించడానికని ఒకమిషగా ద్వితీయ స్వయంవరం అని యేర్పాటుచేస్తే రెండోమారు పెళ్లాడుతూవున్నావుపో అని నెపుతూ వున్నారూ? పుట్టెడు తప్పులుమీవి. అన్యాయం అంతా మీరేచేశారు. పైగా నన్ను పదిమందిలో నిందిస్తారా? యిప్పుడు నేనుచెప్పినవన్నీ మీ తప్పులుకావని యీ పెద్ద మనుష్యులముందు ఒప్పించండి!' అంటూ తిరగబడ్డాను. దానితో ఆ మానవుడు నీరయిపోయాడు. ముఖం చిన్నబుచ్చుకున్నారు, పదిమందీ బుద్ధి చెప్పారు. ఇంక యీయన ముఖం చూడకూడదనుకున్నాను.

ఆ తరువాత మా నాన్నగారు ఆయనకు చికిత్స చేయించారు. మళ్లీ యథారూపం వచ్చిందని విన్నాను. కాని అటు పోరాదనుకున్నాను.

ఒకనాడు తోటలో తిరుగుతూ వున్నాడు, కొంత దూరంలో ఆయన పిల్లలతో ఆడుతూ వుండడం చూచా. పిల్లలు ఆయనతో కులాసాగా అనుకొంటూ వున్నారు. నాకా దృశ్యం మహా ఆనందంగా కనబడింది. అంతవరకూ నా మనసులో గడ్డకట్టుకొని వున్న ఆద్వేషం అంతా కరిగి, ఆవిరై యెక్కడకో పోయింది నాకాళ్ళు ముందుకు సాగాయి. వెళ్లి ఆరోగ్యంగా వున్నారా అన్నాను. ఆయన నన్ను చూచి ముఖం యింత చేసికొని సంతోషపడుతూ "నన్ను క్షమించవూ" అన్నారు.

నేను యింక యెదురాడలేకపోయాను. సోదరసోదరీమణులారా, యిది నా భూలోకజీవనము, యిప్పటికే చాలా కాలం అయింది. మీరు యెటువంటి విసుగులేకుండా విన్నందుకు నేను సంతోషిస్తున్నాను అంటూ కరతాళ ధ్వనులమధ్య దమయంతి కూర్చున్నది.

అంతతో ఆనాటి సభ ముగిసింది.